

ఎంపీపీ అరవిందరావును సన్మానిస్తున్న జడ్పీటీసీ హరిప్రియ, ఎంపీటీసీలు, అధికారులు

సేవ చేసినవారే ప్రజానాయకులు

పరిగి ఎంపీపీ కరణం అరవిందరావు

పరిగి, జూన్ 29 : అనునిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటూ సేవ చేసినవారే ప్రజానాయకులుగా నిలుస్తారని పరిగి ఎంపీపీ కరణం అరవిందరావు పేర్కొన్నారు. ఐదేండ్లలో గ్రామాల అభివృద్ధికి కృషి చేశామన్నారు. ఎంపీపీ అధ్యక్షతన శనివారం పరిగి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. అనంతరం జరిగిన సన్మాన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ.. ఐదేండ్ల కాలంలో గ్రామాలాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు సహకరించారని తెలిపారు. సమావేశాల సందర్భంగా అధికారుల దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించారన్నారు. ప్రభుత్వం ద్వారా మంజూరైన నిధులన్నీ ఎంపీటీసీ నియోజకవర్గాలకు సమానంగా కేటాయించి అభివృద్ధి చేశామన్నారు. ప్రతి ఎంపీటీసీ పరిధిలో రూ.5లక్షలకు పైగానే వెచ్చించి మండల పరిషత్ ద్వారా పనులు చేసినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారం వల్లే ఐదేండ్లలో పరిగి ప్రాంతం అభివృద్ధికి కృషి చేశామని తెలిపారు. పదవీ కాలం ముగిసిన తర్వాత సైతం ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అంతకుముందు వివిధ అంశాలపై ఆయా శాఖలవారీగా చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీపీ అరవిందరావును జడ్పీటీసీ హరిప్రియ, ఎంపీటీసీలు, అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, ఎంపీడీవో ప్రభాకర్‌రెడ్డి, తహసీల్దార్ ఆనంద్‌రావు, ఎంపీటీసీలు వెంకట్‌రాంరెడ్డి, రవి, సంపూర్ణ, పద్మమ్మ, జహీరాబీ, పద్మమ్మ, వెంకటేశ్, పర్వేది, లక్ష్మి, వివిధ శాఖల అధికారులు, గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

మర్పల్లి తైబజార్ వేలంలో పాల్గొన్న అధికారులు, గ్రామస్తులు

తైబజార్ల వేలం

మర్పల్లి, జూన్ 29 : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద శనివారం తైబజార్ వేలం నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తైబజార్ వేలం పాటలో పలువురు పాల్గొనగా బోయిని రాజు రూ.4లక్షల55వేలు పలికి దక్కించుకున్నట్లు తెలిపారు. గ్రామపంచాయతీ నిర్ణయించిన ధరలకే తీసుకోవాలని, ఎక్కువ డబ్బులు వసూలు చేసినట్లు తెలిస్తే పర్మిషన్ రద్దు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గణేశ్, ఎంపీవో సుశీల్‌కుమార్ పాల్గొన్నారు.

కులకచర్లలో

కులకచర్ల : మండల కేంద్రంలో ఉన్న తైబజార్‌కు శనివారం వేలం పాట నిర్వహించారు. కులకచర్ల మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్ మురళీధర్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో తైబజార్‌కు వేలం పాట నిర్వహించగా.. గ్రామానికి చెందిన 10 మంది సభ్యులు పాల్గొనగా.. వారిలో పి.వెంకట్‌రాములు రూ.7,01,100 లకు చేజిక్కించుకున్నాడు. 9 నెలల పాటు వేలం పాట వర్తిస్తుందని అధికారులు తెలిపారు. అమ్మకందారుల నుంచి నిర్ణీత సొమ్మును మాత్రమే వసూలు చేసుకోవాలని, నిబంధనలను అతిక్రమించి డబ్బులు వసూలు చేస్తే వేలం రద్దు చేస్తామన్నారు.



కులకచర్ల : తైబజార్ వేలం పాటలో పాల్గొన్న తహసీల్దార్ మురళీధర్ తదితరులు

వర్షాలు కురువాలని..

వికారాబాద్, జూన్ 29 : వర్షాకాలం ప్రారంభమైనా.. పంటలకు సరిపడా వర్షాలు లేక విత్తుకున్న విత్తనాలు మొలవక, విత్తనాలు విత్తుకుందామంటే వర్షాలు లేక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురువాలని వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 2వ వార్డు ధన్నారం గ్రామంలో శనివారం గ్రామస్తులంతా ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. బొడ్రాయిపై నీటిని పోస్తూ వరుణ దేవుడిని ప్రార్థించారు. అనంతరం స్వామివారి చిత్రపటంతో ఊరేగించి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ఆలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న గ్రామస్తులు



చైర్మన్‌గా ఎన్నికైన దస్తయ్యకు నియామక పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి బిచ్చిరెడ్డి

పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం మండల చైర్మన్‌గా కుమ్మరి దస్తయ్య

దోమ, జూన్ 29 : పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం నూతన చైర్మన్‌గా కుమ్మరి దస్తయ్య ఎంపికైనట్లు పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఎన్నికల అధికారి బిచ్చిరెడ్డి పేర్కొన్నారు. సంఘంలో 10 మంది డైరెక్టర్లు ఉండగా.. 10 మందిలో ఎక్కువ మంది డైరెక్టర్లు ఎవరికి మద్దతు తెలుపుతారో వారే సంఘం చైర్మన్‌గా ఎన్నిక కాబడతారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నలుగురు పోటీ చేయగా కాంగ్రెస్ పార్టీకి చెందిన చంద్రానాయక్, మల్లేశ్ గెలుపొందగా.. ఇరు వర్గాలకు చెరో ఐదు స్థానాలు సమం కాగా.. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఒక డైరెక్టర్ కాంగ్రెస్‌కు మద్దతు తెలుపడంతో ఆ పార్టీ అభ్యర్థి దస్తయ్య చైర్మన్‌గా గెలుపొందారు. దస్తయ్యకు ఎన్నికల అధికారి చైర్మన్‌గా బాధ్యతలు అప్పగిస్తూ నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం దస్తయ్యను సన్మానించారు. తదనంతరం చైర్మన్‌గా ఎన్నికైన దస్తయ్యను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నిర్వాహకుడు లింగం, పాల ఉత్పత్తిదారుల సంఘం సభ్యులున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి పట్టణంలో పోలీసుల కార్డన్ సెర్చ్

పరిగి, జూన్ 29 : రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యతని పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం పరిగిలో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాల తనిఖీతోపాటు పాన్‌షాప్‌లలో గుట్కాల విక్రయాలకు సంబంధించి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపోలో పలువురికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. మైనర్‌లకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. ప్రతి వాహనానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు దగ్గర పెట్టుకోవాలని, డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు ఇన్సూరెన్స్, వాహన ఆర్‌సీ కార్డు తదితర పత్రాలు ఉండాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపించరాదన్నారు. నిషేధిత గుట్కాలు, గంజాయి వంటివి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. కార్యక్రమంలో పరిగి, చన్గోముల్, దోమ, కులకచర్ల ఎస్ఐలు సంతోష్, మధుసూదన్‌రెడ్డి, ఆనంద్, అన్వేష్ పాల్గొన్నారు.

ప్రతి సోమవారం ప్రజావాణి

పెద్దేముల్, జూన్ 29 : మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని మండల ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో జర్నప్ప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజల సౌకర్యార్థం ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో నిర్వహించనున్నామన్నారు. ఈ మేరకు జులై 1 నుంచి అమలు కానున్నదన్నారు. ప్రజావాణిలో ఎమ్మార్వో, ఏవో, ఏఈలు, ఎంపీవో, ఇతర శాఖల మండల స్థాయి అధికారులు విధిగా హాజరుకావాలని సూచించారు.

మర్పల్లిలో..

మర్పల్లి : మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం నుంచి ప్రతి వారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజమల్లయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశానుసారం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందని.. మండలస్థాయి అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

దోమ మండలంలో..

దోమ : దోమ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి ఉంటుందని ఎంపీడీవో మహేశ్ బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో సోమవారం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు లబ్ధిదారుల నుంచి అర్జీలను స్వీకరిస్తామన్నారు. అధికారులందరూ సమయానికి హాజరు కావాలన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ధారూరు, జూన్ 29 : మండల పరిధిలోని నాగసముందర్ గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు నర్సింహులు అనారోగ్యంతో మరణించడంతో.. ఆయన భౌతికకాయానికి వికారాబాద్ నియోజవర్గ ఇన్‌చార్జి వడ్ల నందు నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి అంత్యక్రియలకు రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాజూనాయక్, వెంకటయ్య, యాదగిరి, అనిల్, మణికంఠా రెడ్డి, రాజు, కృష్ణ ఉన్నారు.

జులై 1 నుంచి స్పోర్ట్స్ స్కూల్‌కు విద్యార్థుల ఎంపిక

కులకచర్ల, జూన్ 29 : జులై 1, 2 తేదీల్లో స్పోర్ట్స్ స్కూల్‌కు 4వ తరగతి విద్యార్థులను ఎంపిక చేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంఈవో హబీబ్ అహ్మద్ తెలిపారు. జులై 1న చౌడాపూర్ ఉన్నత పాఠశాలలో, 2న కులకచర్ల మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఎంపిక కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

యువకుడు అదృశ్యం

కుమ్మరి దశరథ్ (ఫైల్)

మర్పల్లి, జూన్ 29 : ఓ యువకుడు అదృశ్యమైన ఘటన మర్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఏఎస్సై మల్లేశం కథనం ప్రకారం.. మండలంలోని పంచలింగాల్ గ్రామానికి చెందిన కుమ్మరి దశరథ్(24) ఈ నెల 26న ఇంటి నుంచి పొలానికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. అప్పటి నుంచి పొలం వద్ద, చుట్టుపక్కల, బంధువుల వద్ద, తెలిసినవారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో దశరథ్ తండ్రి నర్సింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. దశరథ్ ఆచూకీ తెలిస్తే మర్పల్లి పీఎస్ 8712670038కు సమాచారం అందించాలని కోరారు.

దివంగత సాయిచంద్ సేవలు మరువలేనివని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కంద పెద్ద నర్సింహ అన్నారు. శనివారం సాయిచంద్ వర్ధంతి సందర్భంగా శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. - కందుకూరు, జూన్ 29



బంట్వారం మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన గండడి సురేశ్ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. శనివారం స్పీకర్ ప్రసాద్‌కుమార్ రూ.2.80లక్షల ఎల్‌వోసీని సురేశ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. - బంట్వారం, జూన్ 29



తాండూరు సబ్ డివిజన్ డీఈఈ గోపీనాథ్, యాలాల సబ్ డివిజన్ డీఈఈ కరుణాకరచారి ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా శనివారం తాండూరు ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంట్రాక్టర్లు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. - తాండూరు రూరల్, జూన్ 29

దోమ మండల పరిధిలోని అయినాపూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడిగా దస్తయ్య ఉద్యోగ విరమణ పొందడంతో శనివారం ఆయనను ఎంఈవో హరిశ్చందర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు సన్మానించారు. - దోమ, జూన్ 29

అభివృద్ధికి సహకరించండి

- సీఎం రేవంత్.. కక్ష సాధింపు చర్యలు మానుకో..
- రద్దు చేసిన రూ.250కోట్లు విడుదల చేయ్..
- గడ్డం ఎన్‌క్లేవ్ కాలనీలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పర్యటన

గుర్రంగూడ గడ్డం ఎన్‌క్లేవ్ కాలనీలో పర్యటిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, జూన్ 29 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివృద్ధికి సహకరించాలి తప్ప కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడ గడ్డం ఎన్‌క్లేవ్ కాలనీలో శనివారం పర్యటించారు. కాలనీల్లో ఉన్న రోడ్ల దుస్థితిని పరిశీలించారు. కాలనీలన్నీ కలియతిరిగి కాలనీవాసులతో మాట్లాడారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని కాలనీవాసులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అడిగినన్ని నిధులు ఇచ్చేవారని గుర్తు చేశారు. శివారు మున్సిపాలిటీల్లో కొత్త కాలనీలు వెలుస్తున్నాయన్నారు. కొత్తగా వెలసిన కాలనీల్లో మౌలిక సౌకర్యాలు కల్పించవలసిన బాధ్యత తనపై ఉందన్నారు. ముఖ్యమంత్రి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడకుండా ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని రద్దు చేసిన రూ.250 కోట్ల నిధులను విడుదల చేయాలన్నారు. ఇటీవల కురిసిన వర్షానికి రోడ్లన్నీ గుంతలమయంగా మారాయన్నారు. రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలంటే నిధులు మంజూరు చేయాలన్నారు. ప్రజల సమస్యలను పరిగణనలోకి తీసుకొని గతంలో రద్దు చేసిన నిధులు మంజూరు చేయించాలని ఆమె కోరారు. రోడ్లు గుంతలమయంగా మారడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రాజకీయ నేపథ్యంలో నిధులు రద్దు చేయడం మంచిది కాదన్నారు.

బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న ప్రధాన రహదారులన్నింటికీ మరమ్మతులు చేయాలని కమిషనర్ రఘుకుమార్‌కు ఆదేశాలు జారీచేశారు. ఎక్కడ కూడా గుంతలు కన్పించవద్దన్నారు. అధికారులు అన్ని రోడ్లను పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కమిషనర్‌కు ఆదేశాలు జారీచేశారు. గతంలో కుల సంఘాలకు సంబంధించి స్థలం కేటాయించడం జరిగిందన్నారు. త్వరలోనే ఆ సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

కార్యక్రమంలో డీఈలు యాదయ్య, జ్యోతి, ఏఈ వినీల్ గౌడ్, యాదగిరి, బడంగ్‌పేట బీఆర్ఎస్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, మాజీ కౌన్సిలర్ సాయి కిరణ్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, జంగారెడ్డి, కృష్ణ, రవి, సత్యనారాయణరెడ్డి, శేఖర్‌రెడ్డి, కాలనీవాసులున్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

కందుకూరు, జూన్ 29 : ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేయడానికి కృషి చేస్తున్నట్లు రంగారెడ్డి జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలో హైదరాబాద్, శ్రీశైలం జాతీయ రహదారిలో నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు, లేమూరులో సీసీ రోడ్డు, పులిమామిడి, దన్నారం గ్రామాల్లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మౌలిక వసతులను కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. పార్టీలకతీతంగా జిల్లాలో నిధులను మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ జంగారెడ్డి, ఎంపీపీ జ్యోతి, వైస్ ఎంపీపీ శమంత, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, ఎంపీడీవో సరిత, ఏఈఈ సతీశ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సురేందర్‌గౌడ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మల్లేశ్, నాయకులు శ్రీధర్ ముదిరాజ్, సత్యనారాయణ, క్రిష్ణా నాయక్, వెంకటరమణారెడ్డి, సాయిలు, జైపాల్‌రెడ్డి, రాంరెడ్డి, ప్రశాంత్‌చారి, యాదయ్య, మూల హన్మంత్‌రెడ్డ, పాండుగౌడ్, ప్రశాంత్, సత్యనారాయణరెడ్డి, విఘ్నేశ్వర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, రాజమ్మ, జగన్, మాజీ ఉప సర్పంచ్ సుధాకర్‌డ్డి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★Corel Draw Photo Shop Designer M/F Sal: 20K, Office Clerk Female Calculation & Receptionist Sal: 15K, 2 No's Marketing Executives (Male) Sal: 18K. Near RTC X-Road, Pillar No. 34 & 35. 9849003504.
NT-97639-All

★ప్రముఖ స్వచ్ఛంద సంస్థలో పని చేయడానికి ITI ఫిట్టర్ / ఎలక్ట్రీషియన్ / డిగ్రీ సిబ్బంది కావలెను. వికారాబాద్ / శంకరపల్లి ప్రాంత నివాసులకు ప్రాధాన్యత. రెజ్యూమ్‌తో హాజరవ్వండి. ఇంటర్వ్యూ తేది: 30-06-2024 ఆదివారం ఉ॥ 10 గం. నుండి. స్థలం: శ్రీ నవజ్యోతి విద్యాలయం, రామయ్యగూడ రోడ్, వికారాబాద్.
NT-339525

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గోశాల, శివాలయ నిర్మాణానికి విరాళం

ఘనాపూర్‌లో గోశాల, శివాలయానికి 2లక్షల విరాళం అందజేసిన బీజేపీ ఓబీసీ రాష్ట్ర మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఈశ్వరప్ప

కులకచర్ల, జూన్ 29 : మండలంలోని ఘనాపూర్‌లో రామలింగేశ్వర గోశాల, శివాలయం నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తున్నానని బీజేపీ ఓబీసీ రాష్ట్ర మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెన్న ఈశ్వరప్ప తెలిపారు. శనివారం ఘనాపూర్ సమీపంలో నిర్మిస్తున్న గోశాల శివాలయానికి రూ.2లక్షల విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో గోశాలను కొనసాగించడం చాలా గొప్ప విషయమన్నారు. ఆధ్యాత్మిక విషయాల్లో ప్రతి ఒక్కరి కృషి ఉండాలని, గుడి, బడి విషయంలో తన వంతు కృషి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా గోశాల నిర్వాహకుడు వెంకటయ్యగౌడ్‌ను అభినందించారు. ఈశ్వరప్పకు డాక్టరేట్ సేవా రత్న రావడంపై ఘనాపూర్ బూత్ అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కులకచర్లలో బీజేపీ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రహ్లాద్‌రావు ఆధ్వర్యంలో ఈశ్వరప్పను సన్మానించారు. ఈ సందర్భంగా ముజాహిద్‌పూర్‌లో వివేకానంద విగ్రహావిష్కరణ ఖర్చుల కోసం రూ.50వేలు గ్రామస్తులకు అందజేశారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి తాండూర్/కొడంగల్ ఇబ్రహీంపట్నం/మహేశ్వరం } 80966 77668 : 80966 77962